నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 19 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

నాన్న చేపలు దొరికాయా.. : మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట చెరువులో చేపల వేట

చెదరని జ్ఞాపకం

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక. ఒక్క ఛాయాచిత్రం కోటి భావాలకు ప్రతీక. కోట్లాది పదాల్లో, లక్షలాది పంక్తుల్లో, వేలాది పేజీల్లో వర్ణించినా కలగని అనుభూతి ఒక్క ఫొటోతో కలుగుతుంది. అక్షరం, శబ్దం కన్నా దృశ్యం అత్యంత శక్తివంతమైంది. కాలానికి కళ్లెం వేసి, దృశ్యాన్ని సజీవం చేసే ఫొటోగ్రఫీకి వందల ఏళ్ల చరిత్ర ఉంది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా జీవన, ప్రకృతి రమణీయ ఛాయాచిత్రాలు మీ కోసం.. - మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆగస్టు 18

సైనికా వందనం : బెల్లపల్లి చౌరస్తాలో సైనికుల విగ్రహాల వద్ద ..

జాతి వైరం మరిచి : ఇందన్‌పల్లిలో తన పిల్లతో పాటు పిల్లికి పాలు ఇస్తున్న కోతి

నమ్మించి ముంచిన్రు

- కాంగ్రెస్ సర్కారు తీరుపై రైతుల ఆగ్రహం
- ఆరు గ్రామాల్లో 'నమస్తే తెలంగాణ' విజిట్
- ఆసక్తికర విషయాలు బయటపెట్టిన అన్నదాతలు

నమస్తే విజిట్ NAMASTE VISIT

రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు చెన్నూర్ వ్యవసాయశాఖ కార్యాలయానికి వచ్చిన రైతులు

అన్ని అర్హతలున్నా రుణమాఫీ చేయలే

ఏఈవో దగ్గర వివరాలు తెలుసుకుంటున్న రుణ మాఫీ కాని రైతులు

***'ఎన్నికలకు ముందు** రూ. 2 లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెసోళ్లు చెబితే నమ్మినం. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్యాయం చేసిన్రు. అన్ని అర్హతలున్నా రుణాలు మాఫీ చేయలేదు. నమ్మిన పాపానికి నట్టేట ముంచిన్రు. గీ సర్కారు ఉన్నన్ని రోజులు మాకీ తిప్పలు తప్పేలా లేవు' అంటూ రైతులు రేవంత్ ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటి వరకు మూడు విడుతల్లో రుణాలు మాఫీ చేయగా, ఈ విషయమై 'నమస్తే తెలంగాణ' బృందం ఆదివారం చెన్నూర్ మండలం కొమ్మెర, గంగారం, కోటపల్లి మండలం కోటపల్లి, జైపూర్ మండలం టేకుమట్ల, మందమర్రి మండలం పాన్నారం, ఆదిలాపేట గ్రామాలను సందర్శించి రైతులతో మాట్లాడగా, వారు ఆసక్తికర విషయాలు బయటపెట్టారు. రుణ మాఫీ పేరుతో కాంగ్రెస్ తమను మోసం చేసిందని వారు మండిపడ్డారు. శుక్రవారం రాత్రి రుణమాఫీ లిస్టును ప్రకటించారని, అందులో తమ పేర్లు లేవని, బ్యాంకులకు వెళ్లి అడిగితే వ్యవసాయశాఖ అధికారుల వద్దకు వెళ్లమని చెబుతున్నారని, వారిని సంప్రదిస్తేనేమో సరైన సమాచారం లేదు.. కనుక్కుంటామంటూ దాట వేస్తున్నారని రైతులు తమ అభిప్రాయాలను తెలిపారు.* - చెన్నూర్, ఆగస్టు 18*

మా కుటుంబంలో ఒక్కరికీ కాలే

చెన్నూర్ రూరల్, ఆగస్టు 18 : మా కుటుంబంలో ముగ్గురం వేర్వేరు బ్యాంకుల్లో రుణం తీసుకున్నం. మా నాన్న పేరు మీద క్రాప్ లోన్ రూ. లక్షా 60 వేలు ఉంది. మీ అమ్మ పేరు మీద క్రాప్‌లోన్ రూ.35 వేలు ఉంది. నా పేరుమీద రూ. 30 వేలు ఉంది. ఒక్క రేషన్ కార్డుకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తమని చెప్పిన్రు. కానీ.. మా ఇంట్లో ఎవ్వరికీ రుణం మాఫీ కాలే. బ్యాంకుకు వెళ్తే వ్యవసాయ శాఖ అధికారులను కలవమని చెప్పిన్రు. వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే మీకు రూ. 2 లక్షలకు మించి క్రాప్ లోన్ ఉంది అన్నరు. మూడో లిస్టులో రుణం మాఫీ అవుతుందన్నరు. శుక్రవారం మూడో లిస్టు కూడా వచ్చింది. అందులో మా పేర్లు లేవు. వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే దరఖాస్తు చేసుకోవాలని చెప్పిన్రు. రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలమైంది. కేసీఆర్ సర్కారులో గిట్లా లేకుండే. - గుజ్జేటి గణేశ్, కొమ్మెర

నట్టేట ముంచిన్రు

కోటపల్లి, ఆగస్టు 18 : నా పేరిట రూ.1.06 లక్షలు. నా భార్య పేరిట రూ.1.09 లక్షల వరకు పంట రుణం ఉంది. రూ. 2 లక్షల దాకా రుణం మాఫీ అయితే మిగతా డబ్బులు కట్టాలి అనుకున్నం. కానీ లిస్టులో మా పేరు రాలేదు. మస్తు బాధ అనిపించింది. ఎన్నికల సమయంలో రూ.2 లక్షల దాకా రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ ఇప్పుడు ఇలా నట్టేట ముంచిండు. ఇకనైనా రైతులందరికీ న్యాయం చేయాలి. - కొట్టె సంతోష్, కోటపల్లి

గీ లింకులు పెట్టుడేందో..

చెన్నూర్ రూరల్, ఆగస్టు 18 : కాంగ్రెస్ నాయకులు ఎన్నికలకు ముందు రూ. 2 లక్షల దాకా రుణమాఫీ చేస్తమని చెబితే మస్తు సంబురపడ్డం. కానీ నమ్మి మోసపోయినం. నాకు రూ. 2 లక్షల 22 వేల రుణం ఉంది. శుక్రవారం రుణమాఫీ లిస్టు వస్తే చూసిన. అందులో నా పేరు లేదు. సార్లను వెళ్లి కలిస్తే రేషన్ కార్డు పరిశీలనలో ఉందని చెప్పిన్రు. కుటుంబ సభ్యుల వివరాలు మళ్లీ నమోదు చేసి దరఖాస్తు చేసుకోమన్నరు. నెల రోజులైతదన్నరు. అసలు క్రాపులోనుకు నా కుటుంబ సభ్యులకు సంబంధమేమిటో అర్థం కాలే. గీ లింకులు పెట్టుడేందో ఏమో. నాకు పట్టా పాస్‌బుక్కు ఉంది. పాన్ కార్డు ఉంది. నాతోటి రైతు ష్యూరిటీ పెట్టుకొని బ్యాంకోళ్లు రుణం ఇచ్చారు. గిట్లా లేనిపోనివి చెప్పి రుణమాఫీ చేయకపోవడం దారుణం. ఇట్లా నా ఒక్కడికే కాదు.. మా ఊరిలో చాలా మంది రైతులకు రుణం మాఫీ కాలేదు. గీ ప్రభుత్వం ఉన్నన్ని రోజులు మాకీ తిప్పలు తప్పేలా లేవు. - జనగామ రమేశ్, గంగారం

ఆశపెట్టి మోసం చేసిన్రు

కోటపల్లి, ఆగస్టు 18 : నా పేరిట, నా భార్య పేరిట రూ.3 లక్షల దాకా రుణం ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో మా పేర్లు లేవు. వ్యవసాయాన్నే నమ్ముకొని జీవిస్తున్నం. రుణమాఫీ పేరిట ఆశపెట్టి ఇలా మోసం చేయడం సరికాదు. రైతుభరోసా డబ్బులు కూడా ఇప్పటి దాకా ఇవ్వలే. కేసీఆర్ సర్కారులో ఇలా లేకుండే. - కాశెట్టి పుల్లయ్య, కోటపల్లి

మా ఊరిలో 20 మంది దాకా ఉన్నరు

జైపూర్, ఆగస్టు 18 : నా పేరు రాజెల్లు. నా భార్య పేరు లక్ష్మి. మా ఇద్దరి పేరు మీద ఇందారం గ్రామీణ బ్యాంకులో రూ. 2 లక్షల 60 వేల పంట రుణం ఉంది. నా పేరు మీద రూ. లక్షా 60 వేలు. నా భార్య పేరు మీద రూ. లక్ష రుణం తీసుకున్నం. మూడో విడుతలో రూ. లక్షా 50 వేల నుంచి రూ. 2 లక్షల దాకా మాఫీ చేస్తరని ఆశపడ్డం. కానీ మూడో విడుత లిస్టు వచ్చింది. అందులో మా పేర్లు లేవు. ఇట్లా మా ఊరిలో 20 మంది దాకా రాని వారు ఉన్నరు. వ్యవసాయాధికారి కార్యాలయానికి వెళ్తే టెక్నికల్ సమస్య ఉంది అంటున్నరు. కొంతమందికి ఇచ్చి.. మరి కొంత మందికి ఇవ్వకపోవడం అన్యాయం. - బల్ల రాజెల్లు, టేకుమట్ల

కేసీఆర్ సర్కారులో గిట్ల లేకుండే

మందమర్రి రూరల్, ఆగస్టు 18 : కాంగ్రెసోళ్లు రుణాలు మాఫీ చేసినమంటూ గొప్పలు చెప్పుకుంటున్నరు. నేను రూ. లక్షా 65 వేల రుణం తీసుకున్న. కానీ నాకు కాలేదు. కేసీఆర్ సర్కారులో రుణం తీసుకుంటే మంచిగ మాఫీ చేసిన్రు. గీ కాంగ్రెసోళ్ల లెక్క లేనిపోని కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బంది పెట్టలేదు. ఇకనైనా రైతులందరికీ న్యాయం చేయాలె. - ముప్పిడి మల్లేశ్, పాన్నారం

అధికారుల చుట్టూ తిరిగినా..

మందమర్రి రూరల్, ఆగస్టు 18 : నేను రూ. 88 వేల రుణం తీసుకున్న. నెల రోజులుగా ఎంతో ఆశపడి ఎదురు చూస్తూ వచ్చాను. కానీ ఒక్క రూపాయి కూడా రుణమాఫీ కాలేదు. అధికారుల చుట్టూ తిరిగిన. ఎవరూ స్పందించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది కానీ.. మాలాంటి రైతులకు అన్యాయం జరిగిందని గుర్తించడం లేదు. ఇకనైనా మేలు చేయాలి. - కోలేటి శారద, ఆదిలాపేట్

కాంగ్రెస్ మోసాన్ని రైతులు గ్రహించాలి

కోటపల్లి, ఆగస్టు 18 : కాంగ్రెస్ ఎలాగైనా అధికారంలోకి రావాలని రైతులకు లేనిపోని హామీలిచ్చింది. ప్రధానంగా రూ. 2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని మభ్యపెట్టింది. ఇప్పుడు రుణ మాఫీ చేయకుండా రైతులను అరిగోస పెట్టుకుంటుంది. రైతు భరోసా డబ్బులు కూడా ఇప్పటి వరకు వేసింది లేదు. కాంగ్రెస్ చేసిన మోసాన్ని ఇప్పటికైనా రైతులు గ్రహించాలి. - సాంబాగౌడ్, పీఏసీఎస్ మండల అధ్యక్షుడు, కోటపల్లి

బీఆర్ఎస్ రైతుల వెన్నంటే ఉంటుంది

కోటపల్లి, ఆగస్టు 18 : కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ, రైతుభరోసా పేరిట మాయ మాటలు చెప్పి రైతులను మోసం చేసింది. ప్రతి గ్రామంలో రూ. 2 లక్షల రుణం తీసుకున్న రైతులు వందల సంఖ్యలో ఉన్నారు. కానీ కేవలం 10 మంది రైతులకు కూడా రుణమాఫీ కాలే. రైతులకు న్యాయం జరిగే వరకూ బీఆర్ఎస్ రైతుల వెన్నంటే ఉంటుంది. - విద్యాసాగర్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు

ఏసీపీ కార్యాలయంలో కలకలం

- కత్తితో గొంతుకోసుకొని బీఆర్ఎస్ కౌన్సిలర్ ఆత్మహత్యాయత్నం
- ఎమ్మెల్యే పీఎస్సార్ ప్రోద్బలంతోనే అక్రమ కేసు పెట్టారని ఆరోపణ
- విచారణ కోసమే పిలిపించామంటున్న ఏసీపీ
- ఉన్నతాధికారులు విచారణ జరపాలి : మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

దవాఖానలో సత్యనారాయణ, ఏసీపీ మధ్య సంభాషణ

మంచిర్యాల ప్రతినిధి(నమస్తే తెలంగాణ)/మంచిర్యాల టౌన్, ఆగస్టు 18 : జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ కౌన్సిలర్ బేర సత్యనారాయణ కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. వివరాలిలా.. నస్పూరు మున్సిపాలిటీలో 21వ వార్డు కౌన్సిలర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్ బేర సత్యనారాయణను ఓ కేసు విషయమై ఏసీపీ తన కార్యాలయానికి పిలిపించారు. ఈ క్రమంలో బేర సత్యనారాయణ అక్కడే ఉన్న కేక్ కట్‌చేసే కత్తితో గొంతు కోసుకున్నాడు. వెంటనే పోలీసులు స్థానిక ప్రైవేట్ దవాఖానకు తరలించారు. కాగా, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావే తనపై కక్షకట్టి అక్రమ కేసులు పెట్టిస్తున్నారని, గతంలో కూడా కేసులు పెట్టించారని, పోలీసులు తనతో అతిగా ప్రవర్తించారని బేర సత్యనారాయణ ఆరోపించారు. నస్పూరు మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 14లో ఏర్పాటు చేసిన వెంచర్‌లో మురుగు కాలువను ఆక్రమించారని వచ్చిన ఫిర్యాదు మేరకు నస్పూరు మున్సిపల్ కమిషనర్ సతీష్ అక్కడికి వెళ్లి విచారణ జరిపారు. కాలువ కబ్జా అయ్యిందని నిర్ధారించుకున్న కమిషనర్ మురుగు కాలువలో వేసిన మట్టిని తవ్వించి యథావిధిగా మార్చారు. ఈ విషయం తెలుసుకున్న బేర సత్యనారాయణ మళ్లీ కాలువలో మట్టి పోసి ఆక్రమించుకున్నాడని తెలియడంతో కమిషనర్ సతీష్ తిరిగి అక్కడికు చేరుకున్నారు. ఈ క్రమంలో అక్కడ కమిషనర్‌తో పాటు ఫిర్యాదు చేసిన వ్యక్తులు, కౌన్సిలర్ మధ్య మాటామాటా పెరిగింది. బేర సత్యనారాయణ తనను కులంపేరుతో దూషించారని, విధులకు ఆటంకం కలిగించారని కమిషనర్ సతీష్ నస్పూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే కమిషనర్‌తో అసలు మాట్లాడనే లేదని, కావాలనే తనను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని బేరసత్యనారాయణ ఆరోపిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉన్న తనను పోలీసులు బలవంతంగా మంచిర్యాలకు తీసుకువచ్చారని ఆయన తెలిపారు.

విచారణ కోసమే పిలిపించాం

నస్పూరు మున్సిపల్ కౌన్సిలర్ బేర సత్యనారాయణను ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులో విచారణ కోసమే పిలిపించామని మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాశ్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారని సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఆరోపించడం సరైనది కాదని, తాను ఇక్కడకు వచ్చి ఆరునెలలే అయిందని, అంతకన్నా ముందు సత్యనారాయణపై ఏడెనిమిది కేసులున్నాయని ఆయన తెలిపారు. అంతకుముందు కూడా ఎస్సీ,ఎస్టీ కేసు నమోదైందని, కోర్టులో నడుస్తున్నదని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ సతీష్ ఇచ్చిన కేసు విషయంలో విచారణకు రావాలని పిలిచినా రాలేదని, అందుకే పోలీసులు వెళ్లి తీసుకువచ్చారని తెలిపారు. గొంతుకోసుకుని కేసును దారి మళ్లించాలని చూస్తున్నారని, విచారణకు అతను రాలేని పక్షంలో తన తరపున ఎవరినైనా పంపించాల్సి ఉంటుందన్నారు.

పూర్తిస్థాయి విచారణ జరపాలి

నస్పూరు మున్సిపల్ కమిషనర్ బేర సత్యనారాయణపై అక్రమ కేసు పెట్టిన పోలీసులు, మున్సిపల్ కమిషనర్‌పై ఆయా శాఖల ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులే లక్ష్యంగా, వారిని ఇబ్బందులకు గురిచేసే చర్యలు సాగుతున్నాయన్నారు.

ఏసీపీ-బేర మధ్య మాటల యుద్ధం

హాట్ టాపిక్‌గా మారిన సంభాషణ

ఏసీపీ కార్యాలయంలో గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కౌన్సిలర్ బేర సత్యనారాయణ, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ మధ్య దవాఖానలో జరిగిన సంభాషణ హాట్ టాపిక్‌గా మారింది. ఇరువురి మధ్య మాటల యుద్ధం సాగింది. కేసుకు సంబంధించిన విషయాలను చర్చించడం ఆసక్తిగా మారింది. సత్యనారాయణ చికిత్స పొందుతున్న ప్రైవేట్ హాస్పిటల్‌కు చేరుకున్న ఏసీపీ ప్రకాశ్ సత్యనారాయణను ఉద్దేశించి 'నేను కావాలని కేసు పెట్టానని అనడం సరికాదు. నీ మీద కేసు వచ్చింది కాబట్టే విచారణకు రావాలని పిలిచాను. నీ మీద 10 కేసులు ఉన్నాయి. ఇప్పుడు తీసిన. కానీ ఇలా చేసుకోవడం సరికాదు.' అన్నారు. ఈ విషయంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. సత్యనారాయణ మాట్లాడుతూ 'నా మీద ఉన్న కేసుల్లో ఒక్కటీ సరైందికాదు. కావాలని పెట్టినవే. వాటిని నిరూపించలేరు. రుజువు చేస్తే దేనికంటే దానికి సిద్ధం. కానీ నీ మీద కూడా సవాలక్ష ఆరోపణలు ఉన్నాయి. ప్రకాశ్ అంటేనే లంచగొండి అని ఉంది. ప్రేమ్‌సాగర్‌రావుపై వంద కేసులు ఉన్నాయి. ఆయనకు ఎందుకు సెల్యూట్ కొడుతున్నావ్. ఊడిగం ఎందుకు చేస్తున్నావ్' అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారుడిని నేను, బీసీ బిడ్డను, దొరలు కావాలని నామీద కావాలనే కేసులు పెట్టిస్తున్నారు. అంటూ సంభాషణ కొనసాగింది.

పుణ్యస్నానానికి వెళ్లి..

- గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాల వెలికితీత
- కొండాపూర్‌లో విషాదం

ద్వారక గోదావరిలో పడి ఇద్దరి యువకుల మృతి

దండేపల్లి, ఆగస్టు 18 : పుణ్యస్నానానికి వెళ్లిన ఇద్దరు యువకులు ద్వారక గోదావరిలో పడి మృత్యువాత పడిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. దండేపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన అల్తాటి అజయ్(19), గంధం చరణ్(17) తమ కుటుంబ సభ్యులతో కలిసి ద్వారక గోదావరికి వెళ్లారు. పవిత్ర స్నానం కోసం గోదావరిలోకి దిగగా, నీటి ఉధృతికి క్షణాల్లో కొట్టుకుపోయారు. కుటుంబ సభ్యులు, బంధువులంతా అక్కడే ఉన్నా ఏమి చేయలేని పరిస్థితి. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం కోసం లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఎదిగిన కొడుకులు కళ్లముందే చనిపోవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. గంధం చరణ్ తండ్రి చిన్నతనంలోనే చనిపోగా, తల్లి వసంత కష్టపడి పెంచింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గంధం చరణ్ (ఫైల్)

అల్తాటి అజయ్(ఫైల్)

పొలంలో మందు చల్లుతుండగా..

- పిడుగుపడి రైతు మృతి
- అతడి భార్యకు సైతం గాయాలు

సిడం శ్రీనివాస్ (ఫైల్)

పెంచికల్‌పేట్, ఆగస్టు 18 : భార్య కండ్లముందే భర్త పిడుగుపడి మృతి చెందిన ఘటన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు గ్రామంలో ఆదివారం జరిగింది. ఎల్లూరుకు చెందిన సిడం శ్రీనివాస్ (43) వరినాటు కోసం ఉదయం తన పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో కూలీలతో కలిసి పొలంలో మందు చల్లుతుండగా ఒక్కసారిగా వర్షం మొదలై అతడిపై పిడుగు పడింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య కాంత కండ్ల ఎదుటే భర్త చనిపోవడంతో అతడి మృతదేహంపై పడి రోదించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది. సమీపంలోనున్న కాంత కూడా స్వల్పంగా గాయపడింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొమురయ్య తెలిపారు.